సాక్షి
నిజామాబాద్

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



బాలికలకు భరోసా
బాలికల ఆత్మరక్షణ కోసం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు కరాటే నేర్పిస్తున్నారు.
- 8లో ▸



గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు..
గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు జేఏసీ నాయకులు కార్యాచరణ మొదలుపెట్టారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.3 /15.5

వాతావరణం
శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

నిజామాబాద్ యువకుడికి అరుదైన అవకాశం

- ఆలిండియా రేడియో సమ్మేళనంలో పాల్గొననున్న గంగాప్రసాద్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్‌లో పుట్టి ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ మల్లెగోడ గంగాప్రసాద్‌కు అరుదైన అవకాశం దక్కింది. ఆలిండియా రేడియో దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆకాశవాణి సర్వ భాషా జాతీయ కవి సమ్మేళనం–2024 కార్యక్రమంలో గంగాప్రసాద్‌కు తన కవిత్వాన్ని చదివే అవకాశం లభించింది. జనవరి 5న జార్ఖండ్ రాజధాని రాంచిలో జరగనున్న కార్యక్రమంలో తెలుగు కవితను ఆయన వినిపించనున్నారు. ఈ కవితను అన్ని భాషల్లోకి తర్జుమా చేసి అన్ని రేడియో స్టేషన్ల ద్వారా జనవరి 25న రాత్రి 10 గంటలకు ప్రసారం చేస్తారు. గంగాప్రసాద్‌కు ఆలిండియా రేడియో హైదరాబాద్ స్టేషన్ డైరెక్టర్ ఉదయశంకర్, పెక్స్‌కో శ్రీహరి, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్, కవి నందిని సిధారెడ్డి, ఆకాశవాణి రిటైర్డ్ అధికారులు చెన్నూరు సీతారాంబాబు, విజయ రాఘవ రెడ్డి, గోపీచంద్ మల్లెగోడ అభినందనలు తెలిపారు.

పంటమార్పిడితో అధిక దిగుబడి



నవీపేట: పంట మార్పిడితో భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందని, రైతులు ఈ దిశగా ఆలోచన చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. మండలంలోని కోస్లీ గోదావరి ఒడ్డున గల అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా శనివారం ఆయన సాగునీటిని విడుదల చేశారు. ఒకే పంట వేయడంతో ధాన్యం నిల్వలు పెరిగాయని, కొనేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా పది లక్షల ధాన్యం నిల్వలు అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, ఎరువుల నిల్వకు సరైన గోదాములు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, కాంగ్రెస్ నాయకు లు గడుగు గంగాధర్, తాహెర్, మానాల మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మోబిన్ పటేల్, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ బద్రినారాయణ, ఈఈ జానీ, డీఏవో వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జూనియర్ బాలబాలికల విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్‌రావు, రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక్‌నగర్‌లోని అభ్యాస స్కూల్‌లో ఉదయం 10.00గంటలకు ఎంపికలు ఉంటాయన్నారు. వివరాలకు 9440007004 (రమేష్) నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: నేషనల్ స్కాలర్‌షిప్ కోసం గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన అభివృద్ధి అధికారి నాగోరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులు ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం!

మోర్తాడ్ : పార్లమెంట్ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ సమాయత్తం అవుతోంది. ఓటర్ల జాబితాల్లో సవరణలు, పోలింగ్ బూత్‌ల మార్పుపై పరిశీలన చేయా లని ఆదేశించింది. దీనిపై ఇప్పటికే బూత్ లెవల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల జాబితాల్లో అనేక తప్పులు దొర్లాయి. వాటిని సరిదిద్ది పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి లోపాలు లే కుండా చూడాలని ఎన్నికల కమిషన్ నిర్దేశించింది. ఒక కుటుంబంలోని అందరి ఓట్లు ఒకే బూత్‌లో ఉండేలా సవరణలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 13,94,986 మంది ఓటర్లు ఉండ గా, 1,549 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వాటిని మార్చాలని కూడా సూచించారు. ఓటర్ల కు పోలింగ్ బూత్‌లు వీలైనంత దగ్గరలో ఉండాలని సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

'ముక్కోటి' శోభ



జెండా బాలాజీ ఆలయంలో స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

- ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చిన స్వామివారు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

జిల్లావ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో స్వామి వారిని భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. నగరంలోని జెండా బాలాజీ ఆలయం, గంగాస్థాన్ ఉత్తర తిరుపతి క్షేత్రం, ఆర్యనగర్ శ్రీ వేంకటేశ్వర, సుభాష్‌నగర్ శ్రీ కోదండ రామాలయాలకు తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. – నిజామాబాద్ సిటీ



జెండాబాలాజీ మందిరంలో వైకుంఠ ద్వారం వద్ద బారులు తీరిన భక్తులు

ఎంపీ టికెట్టు రేసులో..

- జహీరాబాద్ బీజేపీ పార్లమెంటు టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారివే..
- శాసనసభ ఎన్నికల సమయంలో అధినాయకత్వం భరోసా ఇచ్చిందంటున్న మేడపాటి ప్రకాశ్‌రెడ్డి
- గట్టి ప్రయత్నాలు చేస్తున్న ఆలె నరేంద్ర కుమారుడు భాస్కర్‌రాజ్
- తమవంతు ప్రయత్నాల్లో బాణాల లక్ష్మారెడ్డి, ఎం బాగారెడ్డి కుమారుడు జైపాల్‌రెడ్డి
- మరోవైపు అత్యధిక సీట్లు గెలుచుకునేందుకు జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ ఫోకస్



బాణాల లక్ష్మారెడ్డి

మేడపాటి ప్రకాశ్‌రెడ్డి

జైపాల్‌రెడ్డి

ఆలె భాస్కర్‌రాజ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : పార్లమెంట్ ఎన్నికలకు కౌంట్‌డౌన్ నడుస్తున్న నేపథ్యంలో జహీరాబాద్ లోక్‌సభ స్థానం టికెట్టు కోసం బీజేపీ నాయకులు ఎవరికి వారు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందూరు ఉమ్మడి జిల్లాలోని బాన్సువాడ, కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి శాసనసభ సెగ్మెంట్లతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, ఆందోల్ సెగ్మెంట్లు జహీరాబాద్ పరిధిలో ఉన్నాయి. జాతీయ స్థాయి అంశాలు ప్రభావితం చేసే ఎన్నికలు కావడంతో పాటు ప్రస్తుతం ప్రధాని మోదీకి ఉన్న ప్రజాకర్షణ నేపథ్యంలో బీజేపీ టికెట్టు కోసం డిమాండ్ పెరుగుతోంది. రెండు జాతీయ పార్టీల మధ్యే పోటీ జరుగుతుందని భావిస్తున్న కొందరు నాయకులు ఆయా పార్టీల తరపున బరిలో నిలిచేందుకు తహతహలాడుతున్నారు. పైగా కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను బీజేపీ అభ్యర్థి ఓడించడంతో గ్రాఫ్ మరింత పెరిగింది. దీంతో బీజేపీ ఎంపీ టికెట్టు కోసం పారిశ్రామికవేత్త మేడపాటి ప్రకాశ్‌రెడ్డి ఢిల్లీ స్థాయిలో గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని వర్ని మండలం హుమ్నాపూర్‌కు చెందిన మేడపాటి ఎంపీఆర్ ట్రస్ట్ ద్వారా ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్‌లలో అనేక సేవా కార్యక్రమాలు, ఉద్యోగ మేళాలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2020 నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో బోధన్ ఎమ్మెల్యే టికెట్టు కోసం తుదివరకు ప్రయత్నాలు చేశారు. బోధన్ నియోజకవర్గంలో సుమారు 15 వేల దొంగ ఓట్లను గుర్తించిన మేడపాటి ప్రకాశ్‌రెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి వాటిని తొలగించేలా చేశారు. అయితే త్రుటిలో పార్టీ టికెట్టును కోల్పోయారు. ఆ సమయంలో మేడపాటికి జహీరాబాద్ ఎంపీ టికెట్టు ఇస్తామని ఢిల్లీ పెద్దలు భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఢిల్లీ స్థాయిలో జహీరాబాద్ టికెట్టు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పలువురు ఢిల్లీ పెద్దలు ఆయనకు భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది.

■ టైగర్ నరేంద్రగా పేరున్న ఆలె నరేంద్ర కుమారుడు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్ సైతం జహీరాబాద్ ఎంపీ టికెట్టును ఆశిస్తున్నారు. భాస్కర్‌రాజ్ పార్టీ తరపున నిరంతరం అనేక కార్యక్రమాలతో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఈ టికెట్టు రేసులో మెదక్ మాజీ ఎంపీ ఎం బాగారెడ్డి కుమారుడు జైపాల్‌రెడ్డి సైతం ఉన్నారు. జైపాల్‌రెడ్డి శాసనసభ ఎన్నికల ముందు బీజేపీలో చేరారు. మరోవైపు గత ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన బాణాల లక్ష్మారెడ్డి సైతం టికెట్టుపై ఆశలు పెట్టుకున్నారు.

■ జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను ఓడించడంతో బీజేపీ బలంపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ క్రమంలో ఉత్తర తెలంగాణలోని అన్ని ఎంపీ స్థానాలతో పాటు జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని సైతం గెలుచుకునేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. శాసనసభ ఎన్నికల్లో ఓట్ల శాతం 15 శాతం దాటడంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టింపు ఓట్ల శాతం దక్కించుకోవాలని పావులు కదుపుతున్నారు. బీఆర్‌ఎస్‌ను ఓడించిన ప్రజలు ఉత్తర తెలంగాణలో మాత్రం ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నట్లు తాజా ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఈ అవకాశాన్ని మరింతగా ఉపయోగించుకుని ఆశించిన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో అగ్ర నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. పసుపు బోర్డు హామీని నిలుపుకోవడంతో బీజేపీకి ఆదరణ మరింత పెరిగింది. దీంతో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకుండా నిజామాబాద్‌తో పాటు జహీరాబాద్ లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు పార్టీ నాయకత్వం కసరత్తు చేస్తోంది.

■ జహీరాబాద్ లోక్‌సభ స్థానంపై బీజేపీ అగ్రనాయకులు భారీగానే ఫోకస్ పెట్టారు. కర్ణాటక సరిహద్దుల్లో ఉండడంతో పాటు బీజేపీకి పట్టు పెరిగిన నేపథ్యంలో ఇక్కడ గెలవాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నారు. తాజాగా ఈ నెల 17న నిజామాబాద్ వచ్చి పార్టీ శ్రేణులతో పాటు కీలక నాయకులతో అంతర్గతంగా విడతలవారీగా సమావేశాలు నిర్వహించిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ నిజామాబాద్, జహీరాబాద్ స్థానాలపై భారీ స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. అదేవిధంగా సంఘపరివార్ నేపథ్యం ఉన్న నేతలతో సైతం సుదీర్ఘ చర్చలు జరిపారు. లోక్‌సభ ఎన్నికల విషయంలో ఏమాత్రం తేడా రాకుండా ముందుకు వెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది.

రూ.రెండు కోట్లతో పాఠశాల ప్రిన్సిపాల్ పరారీ

ఆర్మూర్ : ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూ.రెండు కోట్లతో పరారైనట్లు తెలిసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు.. సదరు వ్యక్తి పట్టణంలోని పెర్కిట్‌లో ఒక ప్రముఖ ప్రైవేట్ విద్యాసంస్థలో ఏడాది పాటు ప్రిన్సిపాల్‌గా పని చేశాడు. అంతకు ముందు మరో పాఠశాలలో పనిచేశాడు. ఏడాది క్రితం పెర్కిట్‌లో ప్రముఖ విద్యా సంస్థకు చెందిన బ్రాంచ్‌ను ప్రారంభించారు. వివిధ పాఠశాలల్లో ప్రిన్సిపాల్‌గా అనుభవం ఉన్నందున ఆ వ్యక్తిని ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఆయన నిరుద్యోగులను దుబాయి పంపిస్తానని డబ్బులు వసూలు చేశాడు. వారిని అక్కడకు పంపకుండా మోసం చేశాడు. కొందరిని పంపినా ఉద్యోగాలు లేకపోవడంతో తిరిగి వచ్చారు. వారు తమ డబ్బులు ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. దీంతో ప్రిన్సిపాల్ పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి రూ.50 లక్షల వరకు అప్పుగా తీసుకున్నాడు. ఇలా నిరుద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి రూ.రెండు కోట్ల నుంచి రూ.రెండున్నర కోట్ల వరకు వసూలు చేశాడు. ఆ డబ్బులు చెల్లించే పరిస్థితి లేక పరారయ్యాడు. పాఠశాలలో ప్రిన్సిపాల్ కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులు నిత్యం వచ్చి ప్రశ్నించడంతో పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ గురించి వివరాలు సేకరించింది. అప్పటికే ఆయన పరారైనట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించగా ప్రిన్సిపాల్ నిర్వాకంతో తమకు సంబంధం లేదని తేల్చి చెప్పారు. ప్రిన్సిపాల్‌పై బాధితులు ఇప్పటి వరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు.

సానిటరీ షాప్‌లో అగ్ని ప్రమాదం



ఎగిసిపడుతున్న మంటలు



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- రూ.30 లక్షల ఆస్తి నష్టం
- మంటలార్పుతుండగా ముగ్గురు ఫైర్ సిబ్బందికి గాయాలు

ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలోని బాలాజీ సానిటరీ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం అర్ధరాత్రి నగరంలోని దేవీ రోడ్డులో గల సానిటరీ షాపులో నుంచి మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో.. మరికొన్ని ఫైర్ ఇంజిన్లను రప్పించి మంటలను ఆర్పి వేశారు. ఈ క్రమంలో దుకాణంలోని యాసిడ్ బాటిళ్లు పేలి నిజామాబాద్ ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి నర్సింగ్‌రావు, లీడింగ్ ఫైర్‌మన్ తిరుపతి, ఫైర్‌మన్ ఆశిష్ కుమార్‌కు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో భవనం పూర్తిగా దగ్ధం కాగా.. రూ.30 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.



చికిత్స పొందుతున్న సిబ్బంది

త్రిభాషా సంగమం

- మూడు భాషలు మాట్లాడే ప్రాంతం
- విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం
- విఠలేశ్వరుని దర్శనం కోసం వందల మైళ్ల పాదయాత్ర
- తెల్లని దోతి, తలకు టోపీ, ఆడవాళ్లేమో గోచిచీరలు
- శాకాహార భోజనానికే ప్రాధాన్యం
- ఇదీ జుక్కల్ ప్రాంతం ప్రత్యేకత

(ఎస్ వేణుగోపాల్‌చారి – సాక్షి, కామారెడ్డి)



మద్నూర్‌లో విఠలేశ్వర భక్తుల పండరీపూర్ యాత్ర

సంప్రదాయాల సమ్మిళితం..

సండే స్పెషల్

మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం. మూడు భాషలు మాట్లాడే జనం. విభిన్న సంస్కృతులకు నిలయం జుక్కల్ నియోజక వర్గం. ఓ పక్క మహారాష్ట్ర, మరోపక్క కర్ణాటక రాష్ట్రాలతో కలిసి ఉన్న జుక్కల్ నియోజక వర్గాన్ని 'త్రిభాషా సంగమం' అంటారు. జుక్కల్ ప్రాంతంలో జుక్కల్, పిట్లం, నిజాంసాగర్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, మద్నూర్, డోంగ్లీ, మహ్మద్‌నగర్ మండలాలు ఉన్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా మగవాళ్లు తెల్లని దోవతి ధరించి తలపై టోపీ పెట్టుకున్న వాళ్లే ఎక్కువగా కనిపిస్తారు. మహిళలు చాలా వరకు గోచీ చీర ధరించడం అలవాటు. ఇప్పటికీ మెజారిటీ ప్రజలు పద్ధతులను పాటిస్తున్నారు. వినయం, విధేయత కూడా కనిపిస్తుంది. కొత్తతరంలో కొన్ని మార్పులు వస్తున్నా, పాత వాళ్లంతా అవే సంప్రదాయాలను పాటిస్తుంటారు. దైవభక్తి ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పటికీ చాలా గ్రామాల్లో నిత్యం భజనలు చేస్తుంటారు. పండుగల సమయంలో అయితే ప్రతి ఊళ్లో జరిగే భజనల్లో అందరూ పాల్గొంటారు. 161వ నంబరు జాతీయ రహదారిని అభివృద్ధి చేసిన తర్వాత ఈ ప్రాంతానికి రవాణా సౌకర్యం పెరిగింది. సంగారెడ్డి నుంచి నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, మద్నూర్ మండలాల మీదుగా ఉన్న ఈ రోడ్డు ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. హైదరాబాద్‌కు వెళ్లడానికి రోడ్డు ఎంతగానో దోహదపడుతోంది. ఈ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పడానికి అనుకూలమైంది.



మూగజీవాలను పూజిస్తున్న ప్రజలు

మూడు భాషలు మాట్లాడే ప్రాంతం

కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జుక్కల్ నియోజకవర్గంలో చాలా మందికి తెలుగుతో పాటు కన్నడ, మరాఠీ భాషలు వస్తాయి. జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, జుక్కల్, మండలాల్లో మరాఠీ మీడియం స్కూళ్లు, కన్నడ స్కూళ్లు అప్పట్లో ఎక్కువగా ఉండేవి. తర్వాత కాలంలో తగ్గాయి. ఇప్పటికీ కొన్ని కొనసాగుతున్నాయి. దాదాపు అందరూ మూడు భాషలు మాట్లాడతారు. జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన వారికి కర్నాటక, మహారాష్ట్రతో వియ్యం అందుకుంటారు. ఆయా రాష్ట్రాలకు చెందిన అమ్మాయిలను ఇక్కడికి, ఇక్కడి అమ్మాయిలను ఆయా రాష్ట్రాలకు ఇస్తుంటారు. బంధుత్వాలు తాతల కాలం నుంచి కొనసాగుతున్నాయి. దీంతో సరిహద్దు ప్రాంతంలో మహారాష్ట్ర, కర్నాటక సంప్రదాయాలు కనిపిస్తాయి. పంచాంగం కూడా అక్కడి వాటినే అనుసరిస్తారు.

పప్పుదినుసుల సాగు

జుక్కల్ నియోజకవర్గంలో ఎక్కువగా పప్పుదినుసులు సాగు చేస్తారు. పెసర, మినుము, కంది వంటి పంటలు ఎక్కువగా సాగవుతాయి. అలాగే సోయా, పత్తి సాగు చేస్తారు. నీటి సౌకర్యం ఉన్నచోట వరి సాగు చేస్తారు. వేల ఎకరాల్లో పప్పుదినుసుల సాగుతో మంచి దిగుబడులు సాధిస్తారు. అక్కడ సాగైన పప్పు దినుసులు వివిధ ప్రాంతాలకు తీసుకెళ్తారు. బిచ్కుంద, పిట్లం, మద్నూర్ మార్కెట్లతో పాటు అంగళ్లలో కూడా పప్పులు ఎక్కువగా అమ్ముతారు. ఇతర ప్రాంతాల వాళ్లు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తారు. పప్పు దినుసుల సాగుతో నాలుగు డబ్బులు సంపాదిస్తారు. ఇక్కడి రైతులు పంట విత్తనం పెట్టిన నుంచి పంట చేతికి వచ్చేదాకా నిత్యం పొలం దగ్గర ఏదో ఒక పని చేస్తూ కనిపిస్తుంటారు.

- అభిప్రాయాలు 8లో..

పెళ్లిళ్లలో గుర్రం మీద ఊరేగింపు ప్రత్యేకం



పెళ్లికొడుకును గుర్రం మీద తీసుకువెళుతూ..

జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో పెళ్లిళ్లలో కూడా ప్రత్యేకత కనిపిస్తుంది. పెళ్లి కొడుకును మండపానికి గుర్రం మీద తీసుకువెళ్లే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. కొందరు పెళ్లి కూతురుని కూడా గుర్రం మీద తీసుకెళ్తుంటారు. పెళ్లి ఇంటికి రంగులు వేసినపుడు ఇంటి గోడలపై పెళ్లిపిలుపు, హార్దిక స్వాగతం అంటూ రాయిస్తుంటారు. మళ్లీ ఇంటికి రంగు వేసేదాకా అవి అలాగే ఉంటాయి. రెండు, మూడు భాషల్లో రాస్తారు.



మద్నూర్‌లో శునకానికి పూజలు..

వార్కారీ సంప్రదాయం

మహారాష్ట్రలోని పండరీపూర్‌లో కొలువుదీరిన విఠలేశ్వర స్వామిని కొలుస్తారు. వార్కారీ సంప్రదాయంగా పేర్కొంటారు. ఒక్కసారి స్వామి వారి మాల ధరించిన వాళ్లు అదే భక్తిభావంతో ఉంటారు. పొద్దున స్నానం చేసి, దేవున్ని తలచుకునేదాకా కనీసం తాగునీరు కూడా ముట్టరు. ఏటా వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం వేల మంది కాలినడకన పండరీపూర్‌కు వెళ్తారు. దాదాపు 4 వందల కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్తారు. ఇరవై రోజుల ముందే ఊళ్లకు ఊళ్లు కలిసి గ్రూపులుగా విఠలేశ్వరుని దర్శనానికి వెళ్తారు. ఈ సంప్రదాయం ఆచరించేవారు పూర్తిగా శాఖాహారులే. ఎలాంటి మాంసాహారం గానీ, మద్యం కానీ ముట్టరు. అలాగే లింగాయత్ సమాజ్ వాళ్లు బసవేశ్వరున్ని పూజిస్తారు. వాళ్లు కూడా శాఖాహారులే. తాగడం, తినడం కనిపించదు. మిగతా కులాల వాళ్లు తమకు ఇష్టమైన దేవుళ్లను పూజిస్తారు.

క్లుప్తంగా

ప్రొఫెసర్‌ పోస్టులను భర్తీ చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): గత ప్రభుత్వం యూనివర్సిటీల్లో ప్రొఫెసర్‌ పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేశ్‌ విమర్శించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం తెయూ ఆర్ట్స్‌ కళాశాల ఎదుట నిరసన, ధర్నా చేపట్టారు. తెయూలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై మెస్‌ చార్జీల అదనపు భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ వర్సిటీ అధ్యక్షుడు ప్రసాద్‌, సహాయ కార్యదర్శి పవన్‌, నాయకులు చిత్రు, ప్రహ్లాద్‌, శంకర్‌, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

లక్ష్మి కాలువ పనుల పరిశీలన



బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మి కాలువ ఆధునికీకరణ పనులను మైనర్‌ ఇరిగేషన్‌ బాల్కొండ ఈఈ భాను ప్రకాశ్‌, డీఈఈ సురేశ్‌ శనివారం పరిశీలించారు. ప్రస్తుతం యాసంగి పంటలకు కాలువల ద్వారా నీటి విడుదల ప్రారంభం కావడంతో పనుల పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు. పంటలు చేతికందే వరకు పనులను నిలిపివేస్తామన్నారు. నాగంపేట్‌ గ్రామ రైతులు కాలువ పనులు చేపడితే క్రాప్‌ హలీడే ప్రకటిస్తామని తీర్మాణం చేయడంతో ఆ ఉప కాలువను కూడ పరిశీలించారు. పనులు చేపట్టే అవకాశం ఉంటే చేపడుతామని అన్నారు. ఆయన వెంట ఏఈఈలు శేఖర్‌బాబు, లింబాద్రి తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు పయనం



నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్టు శనివారం పయనం అయ్యింది. ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 26 నుంచి 30వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర బాల, బాలికల జట్లకు పది రోజుల నుంచి నందిపేట్‌లో శిక్షణ శిబిరం నిర్వహించారు. బాలికల జట్టు టీమ్‌ మేనేజర్‌గా బిల్లా అనిల్‌, కోచ్‌గా మీసాల సుజాత, బాలుర టీం మేనేజర్‌గా ఎండీ అతీకుల్లా, కోచ్‌గా సుధాకర్‌ వ్యవహరించనున్నారు. క్రీడాకారులను విద్యా వికాస్‌ జూనియర్‌ కళాశాల కరస్పాండెంట్‌, జిల్లా ఖోఖో అసోసియేషన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్‌ మీసాల ప్రశాంత్‌, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌గా రవీందర్‌

నిజామాబాద్‌రూరల్‌: సారంగపూర్‌లోని బీఈడీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌గా రవీందర్‌ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా నియామకపత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్‌ సాయిలు రవీందర్‌కు శనివారం అందజేశారు. పలువురు అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పందులకు టీకాలు వేయించాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలోని పందులకు పందుల పెంపకందారులు సీఎస్‌ఎఫ్‌ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి సింహారావు శనివారం పేర్కొన్నారు. సీఎస్‌ఎఫ్‌వీ అనే వైరస్‌ ద్వారా పందులలో క్లాసికల్‌ స్వైన్‌ ఫీవర్‌ వస్తుందని అన్నారు. దీంతో పందుల పెంపకందారులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధి సోకిన పందులను వేరుగా ఉంచాలన్నారు. సీఎస్‌ఎఫ్‌ వ్యాక్సిన్‌ను ప్రతి సంవత్సరం ఇప్పించాలని కోరారు.

బాలికలకు భరోసా..



హసాకొత్తూర్‌లో కరాటే సాధన చేస్తున్న బాలికలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ఝాన్సీలక్ష్మీబాయి ఆత్మ సంరక్షణ పథకం
- వారానికి మూడు రోజుల పాటు కరాటేలో శిక్షణ
- ప్రభుత్వ పాఠశాలల బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు..

కమ్మర్‌పల్లి: బాలికల సంక్షేమానికి ప్రభుత్వం, విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పాఠశాలల్లో బాలికలకు ఆత్మ రక్షణ విద్యతో పాటు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, బాలికల సాధికారత కమిటీలను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. బాలికల స్వేచ్ఛ సమానత్వం, హక్కుల గురించి తెలియజేస్తూ వారికి ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. లింగ వివక్ష, హింస, బాలికలపై పెరుగుతున్న దాడులు, అరాచకాలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంగా కమిటీలు పనిచేయనున్నాయి.

నవంబర్‌లో మొదలు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు ఝాన్సీలక్ష్మీబాయి ఆత్మ రక్షణ పథకం కింద కరాటే విద్యలో శిక్షణ ఇస్తున్నారు. నవంబర్‌ మొదటి వారంలో ప్రారంభమైన ఈ శిక్షణ మూడు నెలల పాటు కొనసాగుతుంది. కరాటే శిక్షణతో బాలికలు ఆపదలో ప్రతిఘటించేందుకు, లైంగిక దాడుల నుంచి రక్షించుకోవడంతో పాటు ఇతరులను రక్షించడానికి ఉపయోగపడుతుంది. శిక్షణకు గాను ప్రభుత్వం శిక్షకులకు నెలకు రూ. 5 వేల చొప్పున మూడు నెలలకు రూ. 15 వేలు రుసుము చెల్లిస్తోంది. విద్యార్థినులు ఉత్సాహంగా కరాటేలో శిక్షణ తీసుకుంటున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలకు బాల్య వివాహాలు, లింగ వివక్ష, హింస, పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఎదుగుదలతో పాటు శారీరక మార్పులు, ఆరోగ్య సమస్యలపై జాగ్రత్తలు వివరిస్తున్నారు. లైంగిక దాడుల నుంచి రక్షణ, లింగ సమానత్వం, జీవన నైపుణ్యాల పెంపు, వ్యక్తిగత శుభ్రత, వంటి అంశాలపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. వారిలో ఆత్మవిశ్వాసం పెంచేందుకు పోలీసులతో సైతం అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. లైంగిక వేధింపులు, దూషణలు, బెదిరింపులు, ఈవ్‌టీజింగ్‌ పలు ఘటనలు జరిగినప్పుడు బాలికలు భయపడకుండా ఫిర్యాదు చేసేలా చైతన్య పరుస్తారు. ఇందు కోసం సహాయక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. వాటిపై డయల్‌ 100, 1098, 181 వంటి సహాయక నంబర్లను రాసి ఉంచుతున్నారు. ఈ నంబర్లతో ఉపయోగం, స్పందన, ఎలాంటి సహాయం అందుతుందనే విషయాలను క్లుప్తంగా వివరిస్తున్నారు.

బాలిక సాధికారత కమిటీల ఏర్పాటు

జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 25, జడ్పీ ఉన్నత పాఠశాలలు 230, కేజీబీవీలు 25, మోడల్‌ హైస్కూళ్లు 10 మొత్తం 290 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 31637 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో బాలికల సాధికారత కమిటీలు ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రతి తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులతో పాటు ఒక ఉపాధ్యాయురాలు, ప్రధానోపాధ్యాయుడు, పోలీసు నుంచి షీ టీం అధికారులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అధ్యక్షుడిగా ప్రధానోపాధ్యాయుడు, కన్వీనర్‌గా మహిళా ఉపాధ్యాయురాలు, ఎక్స్‌టర్నల్‌ సభ్యులుగా మహిళా కానిస్టేబుళ్లు, షీ టీం ఇన్‌చార్జి ఉంటారు. జిల్లా స్థాయిలో అధ్యక్షుడిగా పాలనాధికారి, సభ్యులుగా విద్యాధికారి, సంక్షేమశాఖ బాలికల అభివృద్ధి అధికారి వ్యవహరిస్తారు. ఈ కమిటీ సదరు పాఠశాలలో ప్రతి నెలా విద్యార్థినులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారు. క్లిష్ట పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవడానికి, సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయడానికి ఈ కమిటీలు దోహదపడనున్నాయి.

గల్ఫ్‌ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు జేఏసీ కార్యాచరణ



ఉమ్మడి కరీంనగర్‌ కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, నాయకులతో గల్ఫ్‌ జేఏసీ నాయకులు

మోర్తాడ్‌: గల్ఫ్‌ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు జేఏసీ నాయకులు కార్యాచరణ మొదలు పెట్టారు. కాంగ్రెస్‌ అధికారంలోని వస్తే వసల కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. కాంగ్రెస్‌ అధికారంలోకి రావడంతో గల్ఫ్‌ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయించడానికి జేఏసీ నాయకులు ఆ పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నారు. గల్ఫ్‌ జేఏసీ నాయకులు నిజామాబాద్‌, ఉమ్మడి కరీంనగర్‌, హైదరాబాద్‌లలో పర్యటిస్తూ కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌, అడ్లూరి లక్ష్మణ్‌, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పార్టీ నేతలు నర్సింగ్‌రావు, ముత్యాల సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి తదితరులను కలుస్తూ సంక్షేమ బోర్డు అంశాన్ని వివరిస్తున్నారు. రానున్న రాష్ట్ర బడ్జెట్‌ సమావేశాల నాటికి గల్ఫ్‌ సంక్షేమ బోర్డు కార్యరూపం దాల్చేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా కాంగ్రెస్‌ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలను జేఏసీ నాయకులు విన్నవిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి హామీ విషయాన్ని వివరించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయించడం, గల్ఫ్‌లో వివిధ కారణాలతో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించేలా కృషి చేయాలని వారు కోరుతున్నారు. కాంగ్రెస్‌ పార్టీ మొదటి నుంచి గల్ఫ్‌ అంశంపై సానుకూలంగా ఉందని అదే దృక్పథంతో తాము ముందుకు సాగుతున్నామని జేఏసీ నాయకులు 'సాక్షి'కి వివరించారు.

అయోధ్య అక్షింతల శోభాయాత్ర



నిజామాబాద్‌ సిటీ: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భగా వీహెచ్‌పీ సభ్యులు నగరంలో శోభాయాత్ర చేపట్టారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర గాజుల్‌పేట్‌ పెద్ద రాంమందిర్‌ నుంచి బోయిగల్లి మీదుగా చక్రం గుడి వరకు కొనసాగింది. అయోధ్యా అక్షింతల కలశాలు 20 రోజుల క్రితం రాగా వీటిని పెద్ద రాంమందిర్‌లో ఉంచారు. శోభాయాత్రలో బడా రాం మందిర్‌ ఉత్తరాధికారి రామచంద్రస్వామి, చక్రం గుడి అర్చకుడు కందాళై నర్సింహ మూర్తి నర్సింహచారి, గంగులరవి, గోవింద్‌ చారి, శ్రీను చారి, మహేశ్‌, శ్రీనివాస్‌ చారి, శ్రావణ్‌, దాత్రిక రమేశ్‌, అనిల్‌, కదం శ్రీకాంత్‌, రాధికమ్మ, సౌజ్ఞ, మహాదేవి, పోశెట్టి పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



ఖలీల్‌వాడి: న్యాయవాదులు న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని బార్‌ కౌన్సిల్‌ కృషి చేస్తున్నదని రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ చైర్మన్‌ నరసింహ రెడ్డి అన్నారు. జిల్లాకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన సెమినార్‌లో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడారు. న్యాయవాదులలో న్యాయసంబంధిత విషయ పరిజ్ఞానం పెంపొందించడానికి సెమినార్లు ప్రయోజనకారిగా ఉంటాయని పేర్కొన్నారు. బార్‌ కౌన్సిల్‌ వైఎస్‌ చైర్మన్‌ సునీల్‌ గౌడ్‌, బార్‌ కౌన్సిల్‌ సభ్యులు రాజేందర్‌ రెడ్డి, కొల్లి సత్యనారాయణ, అనంతసేన రెడ్డి, భైరపాక జయకర్‌, కొండారెడ్డి, కిరణ్‌ పాలకుర్తి, రామారావు, మధుసూదన్‌ తమ సందేశాలను అందజేశారు. బార్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతన చట్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తెలిపారు. నిజామాబాద్‌ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ.. న్యాయవాదులు నిత్య విద్యార్థులేనని నిరంతర అధ్యయనమే వృత్తిని వృద్ధి చేస్తుందని అన్నారు. సెమినార్‌కు సమన్వయ కర్తగా బార్‌ కౌన్సిల్‌ సభ్యులు మంథని రాజేందర్‌ రెడ్డి వ్యవహరించారు. సెమినార్‌లో సీనియర్‌ హైకోర్టు న్యాయవాది విద్యాసాగర్‌ రెడ్డి, నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు దేవదాసు, ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శి భాగీ చరణ్‌, రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ కార్యదర్శి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్‌ ఫేర్‌కు..



కమ్మర్‌పల్లి: జాతీయస్థాయి సైన్స్‌ ఫేర్‌కు మండలంలోని చౌట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన 'ఆటోమెటిక్‌ టాయిలెట్‌ క్లీనర్‌' ఎంపికైంది. పాఠశాలకు చెందిన సైన్స్‌ టీచర్‌ పొల్దే రాజు పర్యవేక్షణలో విద్యార్థులు రోహిత్‌, శివకుమార్‌లు 'ఆటోమెటిక్‌ టాయిలెట్‌ క్లీనర్‌' అనే పరికరాన్ని రూపొందించారు. మహారాష్ట్రలోని పూణెలో ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి 50వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక్‌ ప్రదర్శిని–2023 కార్యక్రమంలో 'ఆటోమెటిక్‌ టాయిలెట్‌ క్లీనర్‌' పరికరాన్ని ప్రదర్శించనున్నారు. పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సైన్స్‌ టీచర్‌ రాజు, విద్యార్థులు రోహిత్‌, శివకుమార్‌లను, ఎంఈవో ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.

త్రిభాషా సంగమం



విఠలేశ్వరుని పూజలో..

సండే స్పెషల్‌



ఎడ్లను పూజిస్తున్న రైతులు



ఇంటి గోడపై రాసిన పెళ్లి ఆహ్వానం

బంధుత్వాలు కలుపుకొంటారు



పిట్లం: నేను కొన్నేళ్లుగా పిట్లంలో ఒక రెస్టారెంట్‌ నడిపిస్తున్నాను. ఇక్కడకు నిత్యం మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల వారు భోజనం చేయడానికి వస్తారు. నేను వారితో కన్నడ, మరాఠీలలో మాట్లాడతాను. జుక్కల్‌ నియోజకవర్గం సరిహద్దులో ఉండడంతో మహారాష్ట్ర, కర్ణాటకలకు చెందిన చాలామంది బంధుత్వాలు కలుపుకుంటారు. దీనివల్ల చాలా మందికి మూడు భాషలు వస్తాయి.

– జనార్దన్‌, సాత్విక రెస్టారెంట్‌, పిట్లం

పండుగలు జరుపుకొంటాం



పెద్దకొడప్‌గల్‌: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో జరుపుకునే సంప్రదాయ పండుగలు ఇక్కడా కూడా చేసుకుంటాం. పెద్ద కొడప్‌గల్‌ మండలానికి మహారాష్ట్ర సరిహద్దు 35 కిలోమీటర్లు, కర్ణాటక సరిహద్దు 26 కిలోమీటర్లు ఉంటుంది. వ్యాపార నిమిత్తం రెండు రాష్ట్రాలకు రెగ్యులర్‌గా వెళ్లి వస్తుంటాం. అందుకే మరాఠీ, కన్నడ భాషలు వస్తాయి.

– కుమ్మరి యాదవ్‌, పెద్దకొడప్‌గల్‌

వార్కారీ సంప్రదాయం గొప్పది



నిజాంసాగర్‌: పాండురంగ విఠలేశ్వర స్వామి మాలధారణ స్వీకరించిన భక్తులను వార్కారీలుగా భావిస్తారు. ఈ సంప్రదాయం చాలా గొప్పది. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రాల్లో పాటిస్తారు. ఏకాదశి రోజున పరమశివుడు, పాండురంగ స్వామి ధ్యానంతో ఉపవాస దీక్ష చేస్తూ పండ్లు ఫలహారాలు స్వీకరిస్తాం. మద్యపానం, ధూమపానం, మాంసానికి, అబద్ధాలు మాట్లాడడానికి దూరంగా ఉంటాం. సప్తాహాల్లో చురుకుగా పాల్గొంటాం. ఎన్నో ఏళ్లుగా వార్కారీ సమాజంలో ఉన్నాం. మాతో పాటు మా కుటుంబ సభ్యులు, పిల్లలు వార్కారీ సంప్రదాయానికి అలవాటు పడ్డారు.

– అప్పు వార్కారి మహరాజ్‌, కంతాలి

మూడు భాషలు అనర్గళంగా వస్తాయి



నిజాంసాగర్‌: కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో జుక్కల్‌ నియోజకవర్గం ఉండడంతో మూడు భాషలను అనర్గళంగా మాట్లాడుతున్నాం. మహారాష్ట్ర వాళ్లతో మరాఠీ, కర్ణాటక వాళ్లతో కన్నడం, మన తెలుగులో మాట్లాడతాం. మూడు రాష్ట్రాలతో బంధుత్వాలు, వ్యాపార సంబంధాలు ఉన్నాయి. త్రిభాషా సంగమంగా మద్నూర్‌, జుక్కల్‌ ప్రాంతాలకు పేరుంది.

– పెంటయ్యసేట్‌, మద్నూర్‌

ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీలు

- బాలుర విభాగంలో ఆదిలాబాద్‌..
- బాలికల విభాగంలో నిజామాబాద్‌ జట్లు విజయం



బహుమతి అందుకుంటున్న నిజామాబాద్‌ జట్టు

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌ మినీ స్టేడియంలో గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్‌–17 బాల, బాలికల సాఫ్ట్‌బాల్‌ పోటీలు శనివారం ముగిశాయి. పది ఉమ్మడి జిల్లాల నుంచి పది బాలుర, పది బాలికల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాజస్థాన్‌లో జనవరి 11 నుంచి 15 వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. బాలికల విభాగంలో నిజామాబాద్‌, బాలుర విభాగంలో ఆదిలాబాద్‌ జట్లు విజయం సాధించాయి. అనంతరం విజేత జట్లకు పరీక్షల సహాయక కమిషనర్‌, ఎస్జీఎఫ్‌ సెక్రటరీ రమణారావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి నాపేఖాన్‌, పెటా సెక్రటరీ భోజన్న, సాఫ్ట్‌బాల్‌ సెక్రటరీ అన్నపూర్ణ, పీటీలు భూమన్న, రామారావు, శ్రీనివాస్‌, జమున తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో 2 కే రన్‌



కామారెడ్డి టౌన్‌: తెలంగాణ అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో కామారెడ్డి డిగ్రీ కళాశాల ఆవరణలో 2 కే రన్‌ను కలెక్టర్‌ జితేశ్‌ పాటిల్‌, ఎస్పీ సింధు శర్మ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ కార్యదర్శి కె. సారంగపాణి, రాజేశ్‌, నారాయణ, జైపాల్‌రెడ్డి, అనిల్‌ కుమార్‌, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, కోచ్‌లు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా పాలిటెక్నిక్‌ కళాశాలకే ఓవరల్‌ చాంపియన్‌షిప్‌



నిజామాబాద్‌నాగారం: నగరంలోని పాలిటెక్నిలో నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌ కళాశాల ఓవరల్‌ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. శనివారం నిర్వహించిన పోటీల్లో మహిళా పాలిటెక్నిక్‌ కళాశాల విద్యార్థినులు కబడ్డీ, షటిల్‌ డబుల్స్‌, పలు క్రీడల్లో ప్రథమ స్థానాల్లో నిలిచారు. క్రీడాకారులకు ప్రిన్సిపాల్‌ నరేష్‌ బహుమతి అందజేశారు.

ఎక్కువ డబ్బు ఇస్తామని టోకరా

బోధన్‌టౌన్‌: బోధన్‌ పట్టణంలోని రెంజల్‌ బేస్‌ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సైబర్‌క్రైంకు గురై రూ. లక్షా85వేలు నష్ట పోయినట్లు సీఐ వీరయ్య శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రెంజల్‌ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కాంట్రాక్ట్‌ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. పది రోజుల క్రితం ఆన్‌లైన్‌లో డబ్బులు పెడితే రెండితలు ఇస్తామని ఓ నంబర్‌ నుంచి మెసేజ్‌ వచ్చింది. ఇది నమ్మిన సదరు వ్యక్తి మొదట రూ. 2 వేలు పంపగా అక్కడి నుంచి రూ. 2800, రూ. 5 వేలు పంపితే రూ. 7 వేలు వచ్చాయి. ఎక్కువ మొత్తంలో డబ్బులు పంపితే ఎక్కువ డబ్బులు వస్తాయని మరోమారు మెసేజ్‌ రావడంతో ఇది నమ్మిన సదరు కాంట్రాక్ట్‌ ఇంజినీర్‌ రూ. 2లక్షల50వేలు వారి అకౌంట్‌లో జమ చేశాడు. తీరా వారి నుంచి మెసేజ్‌ రాకపోవడంతో మోసపోయానని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసిన పోలీసులు సైబర్‌ క్రైం టోల్‌ ఫ్రీ నంబర్‌ 1930కు కాల్‌ చేసి ఫిర్యాదు చేయగా బాధిత వ్యక్తి అకౌంట్‌ ఫ్రీజ్‌ చేసినట్లు తెలిపారు. రూ.2లక్షల50వేల నుంచి రూ.1లక్షా85 వేలు విత్‌డ్రా కాగా రూ. 65 వేలు ఫ్రీజ్‌లో ఉన్నాయని సీఐ తెలిపారు. సైబర్‌ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని ఫోన్‌ నంబర్ల నుంచి మెసేజ్‌లు వస్తే స్పందించ వద్దని, అనుమానం వస్తే సైబర్‌ క్రైం టోల్‌ ఫ్రీ నంబర్‌ 1930కు ఫోన్‌ చేయాలని కోరారు.

బాలిక అదృశ్యం

జక్రాన్‌పల్లి: మండలంలోని ఓ గ్రామంలో పదహారేళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన సదరు బాలిక తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు.బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు.

జానకంపేటలో వృద్ధుడు..

ఎడపల్లి: జానకంపేట గ్రామానికి చెందిన రుక్మాయి నాగేశ్వర్‌(71) అదృశ్యమైనట్లు ఎస్సై విక్రం తెలిపారు. నాగేశ్వర్‌ మానసిక స్థితి బాగా లేదని ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లిన నాగేశ్వర్‌ తిరిగి రాలేదన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

బాల్కొండ: ముప్కాల్‌ మండల శివారులోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై భాస్కరచారి శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల శివారులోని లక్ష్మీనృసింహ ఆలయ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమారు 60 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఆలయ వాచ్‌మన్‌ ఇచ్చిన సమాచారం మేరకు జాతీయ రహదారిపై భిక్షటన చేసే వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని బాల్కొండ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు..

ఎడపల్లి: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని జంలం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లికి చెందిన అశోక్‌ కల్లు సేవించేందుకు మండలంలోని జంలం గ్రామానికి వెళ్లాడు. కల్లు సేవించిన అనంతరం కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లగా చెరువులో పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ..

నిజామాబాద్‌రూరలల్‌: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మాధవనగర్‌ ఆలయంలోని వాటర్‌ ట్యాంక్‌లో దూకి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. చనిపోయిన వ్యక్తికి మతి స్థిమితం లేదని మృతుడి వయస్సు 45 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. శరీరంపై బట్టలు లేకుండా ఆలయంలోకి చొరబడి వాటర్‌ ట్యాంక్‌లో దూకాడని చెప్పారు. ఆలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 8712659852, 8712659851 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

వ్యక్తి గొంతు కోసిన దుండగులు

సిరికొండ: మండలంలోని చిన్నవాల్గోట్‌ గ్రామంలో పిట్ల చిన్నరాములు అనే వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో గొంతు కోసినట్లు ఎస్సై రమేశ్‌ శనివారం తెలిపారు. బాధితుడు శుక్రవారం సిరికొండలో రాత్రి వరకు మద్యం సేవించాడని చెప్పారు. న్యావనంది చౌరస్తా నుంచి చిన్నవాల్గోట్‌ వెళ్లే దారిలో మత్తులో నిద్ర పోయాడని, మత్తు దిగిన తర్వాత శనివారం తెల్లవారుజామున లేచే సరికి గొంతు కోసి ఉందని బాధితుడు తెలిపినట్లు ఎస్సై పేర్కొన్నారు. గాయంపై టవల్‌ చుట్టుకొని గ్రామంలోకి వెళ్లగా గ్రామస్తులు బాధితుడిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని తెలిపారు. బాధితుడి నుంచి వివరాలు సేకరించామని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

బోధన్‌టౌన్‌: మనస్తాపంతో ఓ వృద్ధురాలు మూడు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బోధన్‌ పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. విషయమై సీఐ వీరయ్యను వివరాలు కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.